సాక్షి
విశాఖపట్నం

శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



పోర్టు హెల్త్ పోర్టల్ ప్రారంభం

విశాఖ పోర్టు అథారిటీలో పోర్ట్ హెల్త్ ఆర్గనైజేషన్ పోర్టల్‌ను చైర్మన్ డా.అంగముత్తు గురువారం ప్రారంభించారు. 8లో



వైద్య సేవలు సంతృప్తికరం

కేజీహెచ్‌లో అందుతున్న వైద్య సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు అన్నారు. 8లో



భద్రతా ఏర్పాట్ల పరిశీలన

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో రైల్వే డీఎస్పీ మోహన్‌రావు భద్రతా ఏర్పాట్లు పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. 8లో

న్యూస్‌రీల్

ఐటీఐలో రెండో విడత కౌన్సెలింగ్‌కు స్పందన



అభ్యర్థికి అర్హత పత్రం అందిస్తున్న కన్వీనర్ శ్రీకాంత్, కౌన్సెలింగ్ సిబ్బంది

కంచరపాలెం: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ ట్రేడుల్లో మిగులు సీట్ల భర్తీకి గురువారం రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌ను ఉపాధి, శిక్షణ శాఖ ప్రిన్సిపాల్, కన్వీనర్ జె.శ్రీకాంత్ ప్రారంభించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్‌లో 1 నుంచి 1069 ర్యాంక్ అభ్యర్థులు పాల్గొనగా 198 మంది ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు అర్హత సాధించారు. వారికి అధికారులు అర్హత పత్రాలు అందజేశారు. 1070 నుంచి 2,544 ర్యాంకుల అభ్యర్థులకు కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం కౌన్సెలింగ్ ఉంటుందని అధికారులు తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. కీర్తి, మాధవి, ఉమాశంకర్, ఎ.రమణ, హెచ్.ఎస్.శ్రీనివాసరావు, వంటాకుల శ్రీనివాసరావు కౌన్సెలింగ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు పూర్తి చేయండి



స్విమ్మింగ్‌పూల్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: బీచ్‌రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బీచ్‌రోడ్డులోని ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్‌తో పాటు కంచరపాలెం, ఎన్‌ఏడీ, గోపాలపట్నం, వేపగుంట, సింహాచలం, బీఆర్‌టీఎస్ రోడ్డు తదితర ప్రాంతాల్లోని జంక్షన్లను కమిషనర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బీచ్‌రోడ్డులోని స్విమ్మింగ్ పూల్ పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రహరీని రంగులతో తీర్చిదిద్దాలని, అంతర్భాగంలోని రోడ్లు పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ వేణుగోపాల్, కార్యనిర్వాహక ఇంజనీర్లు సుధాకర్‌ను ఆదేశించారు. జంక్షన్లలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, వెంటనే పారిశుధ్య కార్మికులచే చెత్తను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు.

డిప్లమో, పీజీ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలు



ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పీజీ డిప్లమో, డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు ఈ నెల 17లోగా దరఖాస్తులను తమ కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తులను ఏయూ వెబ్‌సైట్ (http://www.audoa.in/) నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పీజీ డిప్లమో విభాగంలో సాయంత్రం నిర్వహించే యోగా, డిప్లమో కోర్సుల విభాగంలో ఏడాది కాల వ్యవధితో నిర్వహించే సాయంకాలం కోర్సులు లలిత సంగీతం, ఆధ్యాత్మిక సంగీతం, కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం, మృదంగం, ఘటం, కంజీర, ఆరు నెలల కాలవ్యవధితో నిర్వహించే యోగా, ఫ్రెంచ్, జర్మన్, జపనీస్, ఫొటోగ్రఫీ, సాఫ్ట్‌స్కిల్స్, కొరియన్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పీజీ డిప్లమో కోర్సులకు ఈ నెల 19న ఉదయం 10 గంటల నుంచి, డిప్లమో కోర్సులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. కోర్సుల వారీగా అర్హతలు, ఫీజులు, తదితర పూర్తి వివరాల కోసం ఏయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఇగ్నో ప్రవేశాల గడువు పెంపు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తు గడువును ఆగస్టు 10వ తేదీ వరకు పొడిగించినట్లు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు గురువారం ప్రకటనలో తెలిపారు. కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలియజేశారు. https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

టిడ్కో జిగేల్

టిడ్కో ఇళ్లకు విద్యుత్ వెలుగులు

- విశాఖ సర్కిల్ పరిధిలో రూ.55.55 కోట్లతో పనులు
- ఇప్పటికే రూ.6.13 కోట్లతో పనుల పూర్తి
- 1,236 ఇళ్లకు మీటర్లు అమర్చిన ఈపీడీసీఎల్
- దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోనే విద్యుత్ కనెక్షన్



మధురవాడలో నిర్మించిన టిడ్కో ఇళ్లు (ఇన్‌సెట్) ఏర్పాటు చేసిన మీటర్లు

సాక్షి, విశాఖపట్నం : పట్టణ పేద ప్రజలు ఆత్మగౌరవంతో సగర్వంగా జీవించేలా తీర్చిదిద్దిన టిడ్కో ఇళ్లకు ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ వెలుగులు అందించడంలో నిమగ్నమైంది. దాదాపు ఇళ్లు పూర్తయిన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసింది. వీధి దీపాలను సైతం అమర్చుతోంది. దరఖాస్తు వచ్చిన 48 గంటల్లోనే క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ అందజేస్తోంది. విశాఖ సర్కిల్ పరిధిలో ఇప్పటివరకు రూ.6.13 కోట్లు ఖర్చు చేసి 1,236 ఇళ్లకు విద్యుత్ సౌకర్యాన్ని అందించింది.

సకల సౌకర్యాల కల్పన

పట్టణాలు, నగరాల్లో నివసించే పేదలు 300 చదరపు అడుగుల ఇల్లు పొందాలంటే చంద్రబాబు ప్రభుత్వం రూ.7.50 లక్షల భారం మోపింది. అదీ 20 ఏళ్లపాటు వాయిదాలు కట్టేలా షరతులు విధించింది. కానీ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అదే ఇంటిని పేదలకు కేవలం ఒకే ఒక్క రూపాయికి అందిస్తోంది. పైగా అక్కచెల్లెమ్మల పేరు మీద ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తోంది. 365, 430 చ.అడుగుల ఇళ్లకు లబ్ధిదారులు చెల్లించాల్సిన మొత్తాన్ని కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 50 శాతానికి తగ్గించింది. అంతే కాదు.. ఒక ఇంటికి కావల్సిన మౌలిక వసతులు కల్పిస్తోంది. టిడ్కో ఇళ్లకు పక్కా రోడ్లు, మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం కల్పించిన తర్వాతే లబ్ధిదారులకు అందిస్తోంది. ప్రతి ఇంటికీ విద్యుత్ సౌకర్యం అందించే బాధ్యతను ఏపీ ఈపీడీసీఎల్ అధికారులు విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

దరఖాస్తు వచ్చిన వెంటనే..

విశాఖపట్నం సర్కిల్ పరిధిలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లకు అవసరమైన విద్యుత్ సరఫరాను అందించేందుకు ఈపీడీసీఎల్ అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారు. నిర్మాణం పూర్తయిన టిడ్కో ఇంటికి విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు వచ్చిన 24 నుంచి 48 గంటల్లోనే సరఫరా అందించేలా చర్యలు చేపడుతున్నారు. సర్కిల్ పరిధిలోని ఆయా డివిజన్లలో నిర్మితమవుతున్న టిడ్కో ఇళ్లకు సంబంధించి ఎప్పటికప్పుడు అధికారులు సమీక్ష నిర్వహిస్తున్నారు. ఈ ఇళ్ల కోసం విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసేందుకు మొత్తం రూ.55.55 కోట్లు అంచనా వ్యయాన్ని నిర్దేశించుకున్నారు. ఇప్పటివరకు పూర్తయిన ఇళ్లకు రూ.6.13 కోట్లు ఖర్చు చేసి 1,236 ఇళ్లకు విద్యుత్ సౌకర్యాన్ని అందించారు.



ఏఎస్‌ఆర్ నగర్‌లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ పరిధిలో..

డివిజన్	అంచనా వ్యయం (రూ.కోట్లలో)	ఖర్చు సరఫరా (రూ.కోట్లలో)	విద్యుత్ ప్రారంభమైన ఇళ్లు
జోన్–1(విశాఖపట్నం)	0.653	0.653	221
జోన్–2(విశాఖపట్నం)	24.968	2.903	230
జోన్–3(విశాఖపట్నం)	4.664	1.649	505
అనకాపల్లి	0.318	0.318	00
కశింకోట	17.465	0.608	280
నర్సీపట్నం	7.480	00	00
విశాఖపట్నం సర్కిల్	55.55	6.13	1236

నిరంతరం సమీక్షిస్తున్నాం..



ఈపీడీసీఎల్ సీఎండీ మార్గదర్శకాల మేరకు టిడ్కో ఇళ్లకు విశాఖ సర్కిల్ పరిధిలో విద్యుత్ కనెక్షన్లు వెంటనే అందించేందుకు ప్రత్యేక సిబ్బందితో కూడిన వ్యవస్థని అందుబాటులోకి తీసుకొచ్చాం. దరఖాస్తులు వచ్చిన వెంటనే వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి కనెక్షన్ అందజేస్తున్నాం. దాదాపు ఇళ్లు పూర్తయిన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధి దీపాల్ని సైతం అమర్చుతున్నాం. టిడ్కో ఇళ్లకు విద్యుత్ వెలుగులు అందించే విషయంలో ఎక్కడా రాజీ పడకుండా శ్రమిస్తున్నాం.

– మహేంద్రనాథ్, ఎస్ఈ, ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్

మీ ఆతిథ్యం బావుంది

- కలెక్టర్‌కు ఎన్నికల అధికారుల ప్రశంస



ధర్మేంద్రశర్మకు కలెక్టర్ ఆత్మీయ సత్కారం

సాక్షి, విశాఖపట్నం : కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో విశాఖ వేదికగా రెండు రోజుల పాటు జరిగిన ఓటరు సవరణ ప్రక్రియ–2024పై సమీక్ష సదస్సు గురువారం ముగిసింది. కేంద్ర ఎన్నికల సంఘం తరఫున హాజరైన అధికారులతో పాటు, 26 జిల్లాల కలెక్టర్లకు నగరం ఆతిథ్యమిచ్చింది. ముగింపు సందర్భంగా సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్లు ధర్మేంద్రశర్మ, నితీష్‌కుమార్ వ్యాస్, ఇతర కేంద్ర అధికారులు విశాఖ జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జునకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. సదస్సు ఏర్పాట్లతో పాటు అందించిన ఆతిథ్యం అద్భుతంగా ఉన్నాయంటూ ప్రశంసించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్‌మీనా సైతం కలెక్టర్‌ను అభినందించారు. ముగింపు సందర్భంగా ఎన్నికల అధికారులకు ప్రభుత్వం తరఫున కలెక్టర్ మల్లికార్జున ఆత్మీయ సత్కారం నిర్వహించారు.

భీమిలి, పెందుర్తి, పశ్చిమ నియోజకవర్గాల సమీక్ష నేడు

మహారాణిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు భీమిలి, పశ్చిమ, పెందుర్తి నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు, సమస్యలపై కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్ష జరగనుంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజని స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్ష చేయనున్నారు. జీవో నం.72, 36/84, 60 ప్రస్తుత స్థితి, వేస్ట్‌వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం, యూపీహెచ్‌సీలు, పీహెచ్‌సీల నిర్మాణాలు, నాడు–నేడు పనులు, గడపగడపకు మన ప్రభుత్వం పనులు తదితర అంశాలపై చర్చ సాగనుంది.

వసతి గృహాల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయ కృష్ణన్



మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయకృష్ణన్

ఏయూక్యాంపస్: సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో ఉండే విద్యార్థుల ఉత్తీర్ణత శాతాలు పెంచే దిశగా సంక్షేమ అధికారులు బాధ్యత తీసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. గురువారం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశమందిరంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల సాంఘిక సంక్షేమ వసతి గృహాల సంక్షేమ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ కృష్ణన్ మాట్లాడుతూ విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. స్టడీ అవర్స్‌లో వారు ఏ విధంగా చదువుతున్నారో గమనించాలన్నారు. అవసరమైతే సంబంధిత సబ్జెక్ట్ టీచర్‌తో మాట్లాడి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. హాస్టల్స్ నిర్వహణ మరింత పటిష్టంగా ఉండేందుకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ)ని తీర్చిదిద్దిన విధానం వివరించారు. సంక్షేమ అధికారులు ముందుగా ఎస్‌వోపీ చదివి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ డాక్యుమెంట్‌ను తెలుగులో కూడా తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ హాస్టల్స్‌లో ఈ ఏడాది సాధించిన ఉత్తీర్ణత వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన ఫలితాలు సాధించిన వసతిగృహాల సంక్షేమ అధికారులను అభినందించారు. జాయింట్ డైరెక్టర్ కె.రామా రావు, అనకాపల్లి జిల్లా సంక్షేమ అధికారి అజయ్ బాబు, వసతిగృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యాధికారిణి మృతి



భవ్య(ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: మెడికల్ డిపార్ట్‌మెంట్ పరీక్ష రాసి బంధువుల ఇంటికి బయలుదేరిన వైద్యాధికారిణి రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందారు. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం బట్టిగళ్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మేడిశెట్టి భవ్య (25) గురువారం షీలానగర్‌లోని డిజిటల్ అయాన్ పరీక్ష కేంద్రంలో మెడికల్ డిపార్ట్‌మెంట్ పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష అనంతరం తన బంధువు కె.మనీషాతో కలిసి పెద గంట్యాడలోని బంధువులను చూడటానికి స్కూటీపై బయలు దేరారు. షీలానగర్ నుంచి పాతగాజువాక వైపు వెళ్తున్న క్రమంలో.. పద్మజ జంక్షన్ వద్దకు వచ్చేసరికి వెనుక వస్తున్న లారీ వీరి వాహనాన్ని ఢీ కొట్టింది. స్కూటీ వెనుక కూర్చున్న భవ్య తూలి లారీ కిందకు వెళ్లిపోయింది. ఆమె నడుం భాగంపై నుంచి లారీ టైర్లు వెళ్లడంతో తీవ్ర గాయాలపాలైంది. వెంటనే ఆమెను మనీషా స్థానికుల సాయంతో ప్రైవేట్ వాహనంలో గాజువాకలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ చికిత్స పొందుతూ భవ్య మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఆమె స్వగ్రామం యానాం. కేసు దర్యాప్తులో ఉంది. భవ్యశ్రీ మృతి పట్ల శ్రీకాకుళం డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి, బట్టిగళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సంతాపం తెలిపారు.

పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేస్తా..

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

సాక్షి, విశాఖపట్నం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు చెప్పారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ.. పార్టీ బలోపేతానికి పాటు పడతానన్నారు. జిల్లాలోని మత్స్యకారులంతా వైఎస్సార్ సీపీకి మద్దతిచ్చేలా కృషి చేస్తానన్నారు. ప్రతీ వార్డులో ఉన్న పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలను కలిసి వారి సమస్యలు వింటానని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తానన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. కార్పొరేటర్లు చెన్నా జానకీరామ్, ఉరుకూటి నారాయణ, పార్టీ జోనల్ అనుబంధ విభాగం ఇన్‌చార్జిలు అల్లంపల్లి రాజుబాబు, కలిదిండి బద్రినాథ్, పార్టీ జిల్లా అనుబంధ విభాగం ఇన్‌చార్జిలు అడ్డాల కృపాజ్యోతి, బొండా ఉమా మహేష్, ముఖ్య నేతలు నడింపల్లి కృష్ణంరాజు, చొక్కర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐపీఈ 3వ స్నాతకోత్సవం రేపు



వివరాలు వెల్లడిస్తున్న డైరెక్టర్ శాలివాహన్

ఏయూక్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ) మూడవ స్నాతకోత్సవం ఈ నెల 5న నిర్వహిస్తున్నట్లు ఐఐపీఈ సంచాలకుడు ఆచార్య శాలివాహన్ తెలిపారు. కళాశాల ప్రాంగణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ రోజు ఉదయం 11.30 గంటల నుంచి నోవాటెల్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియోమాగ్నటిజం, ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ గౌరవ శాస్త్రవేత్త ఆచార్య అర్చన భట్టాచార్య ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని చెప్పారు. పెట్రోలియం ఇంజినీరింగ్‌లో 56 మంది, కెమికల్ ఇంజినీరింగ్‌లో 46 మంది విద్యార్థులు డిగ్రీలు స్వీకరిస్తారని వెల్లడించారు. ప్రతీ బ్యాచ్ నుంచి ఇద్దరికి వారి ప్రతిభ ఆధారంగా బంగారు, వెండి పతకాలను అందిస్తామన్నారు. సమగ్ర ప్రతిభను పరిశీలించి ఓ విద్యార్థికి ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్ అందజేస్తామన్నారు.

ఈ ఏడాది రెండు కొత్త కోర్సులు

ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి బి.టెక్ మెకానికల్ ఇంజినీరింగ్, అప్లయిడ్ జియాలజీ ఎమ్మెస్సీ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు ఆచార్య శాలివాహన్ తెలిపారు. ఆయిల్ ఇండియా లిమిటెడ్ సంస్థ రూ.1.25 కోట్ల పరిశోధన ప్రాజెక్టును అందించిందన్నారు. ఎన్టీపీసీకి కరోజన్ సంబంధిత పరిశోధన ప్రాజెక్ట్‌కు పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఎనర్జీ రంగం, పరిశ్రమలను అనుసంధానం చేయడం, విదేశీ భాగస్వామ్యం అనే మూడు అంశాలు ప్రధానంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. బాలికా విద్యను ప్రోత్సహించడానికి 10 మందికి ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు వివరించారు.

వంగలిలో శాశ్వత క్యాంపస్ : ఐఐపీఈ శాశ్వత భవనాల నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని ఆచార్య శాలివాహన్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఈ నెలాఖరుకు టెండర్లు ఖరారు చేస్తామన్నారు. సబ్బవరం దగ్గర వంగలిలో రూ.401 కోట్ల వ్యయంతో క్యాంపస్ నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో 96.47 శాతం మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయని.. మిగిలిన వారు ఉన్నత విద్యకు ఆసక్తి చూపినట్లు తెలిపారు. తమ ఆచార్యులు 35 పరిశోధన పత్రాలను ప్రతిష్టాత్మక జర్నల్స్‌లో ప్రచురించారన్నారు. మొత్తం రూ.9.5 కోట్ల విలువైన 15 పరిశోధన ప్రాజెక్టులను నిర్వహించామన్నారు. డీన్(రీసెర్చ్–డెవలప్‌మెంట్) ఆచార్య కె.విజయ్ కుమార్, డీన్(అకడమిక్స్) ఆచార్య దీపక్ అంబన్ మిశ్రా, రిజిస్ట్రార్ శ్రీ రాంపాల్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు.

భార్యే అసలు సూత్రధారి?

- కానిస్టేబుల్ మృతి కేసులో కొత్త మలుపు
- ప్రియుడితో కలిసి భర్తను చంపేసిందా?
- ఇద్దరినీ విచారించిన ఎంవీపీ పోలీసులు



భార్య శివాని, పిల్లలతో రమేష్ (ఫైల్)

ఎంవీపీకాలనీ: వన్‌టౌన్ పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ మృతి కేసు కొత్త మలుపు తిరిగింది. ప్రియుడితో కలిసి భార్యే అతన్ని హత్య చేసినట్లు తెలిసింది. 2009 బ్యాచ్‌కు చెందిన బర్రి రమేష్(35) ఆదర్శనగర్‌లో ఉంటూ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే బుధవారం ఉదయం అతను చనిపోయినట్లు ఎంవీపీ పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. బెడ్‌పై విగతజీవిగా ఉన్న రమేష్‌ను పరిశీలించారు. అనంతరం భౌతికకాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. రాత్రి మద్యం సేవించి పడుకున్నాడని, తెల్లవారి లేచి చూసేసరికి చనిపోయి ఉన్నాడని అతని భార్య బుధవారం పోలీసులకు తెలిపింది. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. కాగా.. రమేష్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ.. అతని అన్నయ్య బర్రి అప్పలరాజు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆ దిశగా ప్రారంభమైన పోలీసుల విచారణలో అవాక్కయ్యే వాస్తవాలు వెలుగుచూసినట్లు సమాచారం. ప్రియుడిపై మోజుతో కానిస్టేబుల్ రమేష్ భార్య శివజ్యోతి అలియాస్ శివాని.. భర్త హత్యకు ప్లాన్ చేసినట్లు తెలిసింది. ట్యాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తున్న రామారావు అనే వ్యక్తితో ఆమెకు కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో రమేష్‌ను అడ్డు తొలగించుకునే క్రమంలో హత్యకు కుట్ర పన్నినట్లు పోలీసులు భావిస్తున్నారు. మంగళవారం రాత్రి రమేష్ మద్యం తాగి పడుకున్న సమయంలో హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు.

ప్రియుడితో కలిసి తలగడతో నొక్కి ఊపిరాడకుండా చేసి చంపినట్లు ప్రచారం జరుగుతోంది. భర్త బెడ్‌పై గిలగిల కొట్టుకుంటున్నప్పుడు భార్య శివాని సెల్‌ఫోన్‌లో తీసిన వీడియో పోలీసులకు చిక్కినట్లు తెలిసింది. అయితే ఆ వీడియో ఎందుకు తీసింది? హత్యకు దారి తీసిన పరిణామాలు ఏంటి? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఆమె వద్ద లభించిన వీడియోలో దృశ్యాలు నేపథ్యంలో అతనిని తలగడతో నొక్కి చంపి ఉంటారా? లేదా విష ప్రయోగం చేశారా అనే కోణాల్లో కూడా దర్యాప్తు చేస్తున్నారు. బుధవారం ఆమె ప్రియుడు రామారావును, గురువారం ఆమెను ఎంవీపీ పోలీసులు పూర్తిస్థాయిలో విచారించినట్లు సమాచారం. అయితే ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించేందుకు పోలీసులు అందుబాటులోకి రాలేదు. దర్యాప్తు పట్ల పూర్తి గోప్యత పాటిస్తున్నారు. వీరు వెల్లడించిన వివరాలతో పాటు పోస్టుమార్టం నివేదిక ఆధారంగా పోలీసులు మరింత లోతైన విచారణ చేపట్టి.. అనంతరం ఈ కేసు వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

క్లుప్తంగా

యువకుడి హత్య కేసులో ముగ్గురికి రిమాండ్

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన యువకుడి హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు రిమాండ్‌కు పంపించారు. తాటిచెట్లపాలెం బజారులోని బార్ అండ్ రెస్టారెంట్‌లో ఇటీవల కైలాసపురానికి చెందిన కిరణ్(22)ను కాపు శివ(నందిగిరినగర్), పి.శ్రీనివాస్(చెక్కుడురాయి బిల్డింగ్), రౌతు సురేష్(కైలాసపురం) హత్య చేశారు. ముగ్గురినీ అరెస్ట్ చేసిన పోలీసులు.. గురువారం రిమాండ్‌కు తరలించారు.

హౌరా మెయిల్ రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: చెన్నైలో గురువారం రాత్రి 7.20 గంటలకు బయల్దేరాల్సిన చెన్నై సెంట్రల్– హౌరా(12840) మెయిల్ సుమారు నాలుగు గంటలు ఆలస్యంగా రాత్రి 11.45గంటలకు బయల్దేరింది. అంతే ఆలస్యంగా ఈ రైలు పలు స్టేషన్‌లకు చేరుకోనుంది.

విశాఖ నుంచి ఎంపీగా పోటీ చేస్తా : పాల్

డాబాగార్డెన్స్: విశాఖ ఎంపీగా పోటీ చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో తెలుగు జర్నలిస్ట్ ఫోరం గురువారం ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. భారతీయ జనతా పార్టీకి అన్ని రాజకీయ పార్టీలు తొత్తుగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. విశాఖకు చెందిన తాను ఇక్కడి నుంచే ఎంపీగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టీజేఎఫ్ ప్రతినిధులు ఈశ్వర్ చౌదరి, ఎల్‌జీ నాయుడు పాల్గొన్నారు.

గొడవకు దిగి.. మేడ పైనుంచి జారి పడి..

- ప్రమాదవశాత్తు మరణించిన రౌడీషీటర్ షణ్ముఖ
- స్నేహితుడి పుట్టినరోజు వేడుకలో ఘటన


మృతుడు షణ్ముఖ కుమార్

గోపాలపట్నం: కల్యాణ మండపంలో స్నేహితుడి పుట్టిన రోజు వేడుక అనంతరం బాయ్‌తో జరిగిన గొడవతో ఆందోళన చెందిన రౌడీ షీటర్.. తప్పించుకునే క్రమంలో రెండో అంతస్తు నుంచి జారిపడి మృతి చెందాడు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 నుంచి 3 గంటల మధ్య ఈ ఘటన చోటు చేసుకుంది. గోపాలపట్నం సీఐ ఈదుల నర్సింగరావు తెలిపిన వివరాలివీ.. గతంలో చినముషిడివాడలో నివాసం ఉండే జంపరంగు షణ్ముఖకుమార్(30) ఇటీవల తన స్వగ్రామమైన హుకుంపేట మండలం అడ్డుమండకు వెళ్లిపోయాడు. హైదరాబాద్‌లో స్నేహితుడు హేమంత్ కుమార్ వద్ద ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. కాగా.. బుధవారం బాజీ జంక్షన్‌కు చెందిన హేమంత్‌కుమార్ పుట్టిన రోజు. ఇటీవలే హేమంత్ విశాఖ రాగా.. పుట్టిన రోజు వేడుకలకు షణ్ముఖ కుమార్ బుధవారం విశాఖ చేరుకున్నాడు. గోపాలపట్నంలోని కల్యాణ మండపంలో ఓ గది అద్దెకు తీసుకుని రాత్రి పుట్టిన వేడుకలు నిర్వహించారు. తర్వాత షణ్ముఖ, హేమంత్, నీరజ్ రఘుతో పాటు మరో ఇద్దరు మద్యం సేవించారు. ఆ సమయంలో కల్యాణ మండపం బాయ్‌తో వీరు గొడవపడ్డారు. అతనిపై చేయి చేసుకున్నారు. అనంతరం నగరానికి చెందిన రఘు, హేమంత్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరో ఇద్దరు షణ్ముఖ కోసం భోజనం తీసుకొచ్చారు. వీరు గదిలో ఉండగా బాయ్ బయటి నుంచి తలుపులు వేశాడు. దీంతో లోపల ఉన్న షణ్ముఖ ఆందోళనకు గురయ్యాడు. తనపై రౌడీషీట్ ఉందని, బాయ్ కేసు పెడితే ఇబ్బందులు పాలవుతానని లోలోన మదనపడ్డాడు. గదిలో ఉన్న బెడ్ సీట్‌ను రెండు ముక్కలు చేసి.. తాడులా తయారు చేశాడు. లాన్‌లో ఉన్న పిల్లర్‌కు బెడ్ షీట్ కట్టి కిందకు దిగేందుకు యత్నించారు. వద్దని స్నేహితులు వారించినా ఆగలేదు. పట్టు తప్పడంతో జారిపడ్డాడు. దిగువన రాళ్లు, గాజుపెంకులు ఉండడంతో తలకి, శరీరంలో పలు చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. గదిలో ఉన్న వారు ఈ విషయాన్ని సమీపంలోని స్నేహితులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని షణ్ముఖను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. సమాచారం అందుకున్న గోపాలపట్నం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది.

షణ్ముఖ.. రౌడీషీటర్

షణ్ముఖ కుమార్‌పై పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో 2015లో రౌడీషీట్ తెరిచారు. హత్య, హత్యాయత్నం, కిడ్నాప్ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. అతను తన స్వగ్రామానికి వెళ్లిపోవడంతో రౌడీషీట్‌ను హుకుంపేట స్టేషన్‌కు బదిలీ చేశారు. షణ్ముఖ మెకానికల్ ఇంజనీరింగ్(డిప్లమో) పూర్తి చేశాడు. తన స్నేహితుడైన హేమంత్ ద్వారా ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాడు. కొద్ది రోజులుగా హైదరాబాద్‌లో అతని వద్దే ఉంటున్నాడు. పుట్టినరోజు వేడుకలకు వచ్చి మృత్యువాత పడ్డాడు. ఎస్ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి'


మాట్లాడుతున్న డొప్ప వెంకటరమణ

డాబాగార్డెన్స్: నగరంలో స్థలం కేటాయిస్తే.. సొంత నిధులతో సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని గ్రేటర్ విశాఖ సిటీవైడ్ కృష్ణ అండ్ మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డొప్ప వెంకటరమణ, కార్యదర్శి కె.సోంబాబు తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖలో సూపర్‌స్టార్ కృష్ణ అభిమానులు పెద్ద సంఖ్యలో ఉన్నారని.. ఆయన విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. ఈ నెల 9న ప్రిన్స్ మహేష్ బాబు జన్మదినోత్సవం పురస్కరించుకుని వృద్ధాశ్రమాలు, పాపాహోం తదితర ఆశ్రమాల్లో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గ్రేటర్ విశాఖ సిటీవైడ్ కృష్ణ అండ్ మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్(సరస్వతి పార్కు)కే గుర్తింపు ఉందని, తమ అసోసియేషన్ పేరు చెప్పుకుని కొందరు చలామణి అవుతున్నారన్నారు. థియేటర్ యాజమాన్యాలు, డిస్ట్రిబ్యూటర్స్ తమ అసోసియేషన్‌నే సంప్రదించాలని కోరారు. అసోసియేషన్ నాయకులు కమల్ కుమార్, జోరీగల గణేష్, నీలాపు శ్రీనివాసరావు, పి.శ్రీనివాస్‌ప్రసాద్, సారిపల్లి శంకర్ పాల్గొన్నారు.

బ్రాండెడ్ ఎక్స్‌పోకు విశేష స్పందన


ఎక్స్‌పోలో వినియోగదారుల సందడి

బీచ్ రోడ్డు: ప్రముఖ బ్రాండెడ్ దుస్తుల విక్రయ, ప్రదర్శనకు నగరవాసుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. గురువారం బీచ్ రోడ్డులోని గేట్ వే హోటల్‌లో ఏర్పాటు చేసిన ఈ బ్రాండెడ్ ఎక్స్‌పోలో రేమాండ్స్, వెస్ట్ సైడ్, బఫిలో, స్పైకర్, జాక్ జోన్స్ వంటి బ్రాండెడ్ దుస్తులు మహిళలు, పురుషులతో పాటు చిన్నారులకు కూడా అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. అన్నింటిపై 80 శాతం వరకు తగ్గింపు లభిస్తుందన్నారు. ఆదివారం వరకు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ అమ్మకాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

బకాయిలున్నా.. స్టీల్‌ప్లాంట్‌కు సేవలందిస్తున్నాం

అదానీ పోర్టు అధికార ప్రతినిధి జీజేరావు

పెదగంట్యాడ: ఆర్ఐఎన్ఎల్(వైజాగ్ స్టీల్‌ప్లాంట్) ఆరు నెలల నుంచి చెల్లింపులు చేయడం లేదని, అయినా తమ సేవలను మాత్రం కొనసాగిస్తున్నామని అదానీ గంగవరం పోర్టు అధికార ప్రతినిధి జీజేరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అదానీ గంగవరం పోర్టు ద్వారా దిగుమతి చేసుకున్న బొగ్గు, సున్నపురాయిని స్టీల్‌ప్లాంట్‌కు అందజేయడం లేదని కార్మిక, ఉద్యోగ సంఘాలు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టేందుకు పోర్టు శక్తి వంచన లేకుండా కృషి చేస్తోందని వివరించారు. ఆర్ఐఎన్ఎల్‌కు సంబంధించి కార్గో హ్యాండ్లింగ్ సేవలను ఎక్కడా నిలిపివేయలేదన్నారు. పోర్టుకు ఆర్ఐఎన్ఎల్ కీలకమైన కస్టమర్‌గా భావిస్తోందని, ఆ సంస్థ బకాయిలు ఉన్నా సేవలను మాత్రం కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. దీనిని కార్మిక, ఉద్యోగ సంఘాలు గుర్తించాలన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై అదానీ గ్రూప్‌కు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. పోర్టు ప్రాంగణం వద్ద ఆందోళనలు చేయడం సరికాదన్నారు.

పోర్టు హెల్త్ ఆర్గనైజేషన్ పోర్టల్ ప్రారంభం

సాక్షి, విశాఖపట్నం: సాగరసేతు– ఎన్.ఎల్.పీ. ప్రాజెక్ట్‌లో భాగంగా విశాఖ పోర్టు అథారిటీలో పోర్ట్ హెల్త్ ఆర్గనైజేషన్ పోర్టల్ సిద్ధమైంది. పోర్ట్ చైర్మన్ డా.అంగముత్తు ఈ ప్రాజెక్టును గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పోర్టల్ పనితీరు, ఏ విధంగా నిర్వహించాలనే అంశాలపై పోర్టు ఉన్నతాధికారులతో చైర్మన్ సమీక్ష నిర్వహించారు.

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

అగనంపూడి: 'అమృత భారత్'లో భాగంగా దువ్వాడ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి, ఆధునీకరణ పనులకు ఈ నెల 6న భూమి పూజ చేయనున్న క్రమంలో రైల్వే డీఎస్పీ మోహన్‌రావు భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. 6న ప్రధాని మోదీ వర్చువల్ పద్ధతిలో పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అదే సమయంలో దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో ఎంపీలు ఎం.వి.వి.సత్యనారాయణ, జీవీఎల్ నరసింహారావు, డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి పాల్గొననున్నారు. ఈ క్రమంలో భద్రతా ఏర్పాట్లలో భాగంగా సమావేశ ప్రాంగణం, పరిసరాలు, ప్లాట్‌ఫామ్‌లు పరిశీలించారు. దువ్వాడ జీఆర్పీ ఔట్‌పోస్ట్‌ను పరిశీలించారు. ఆర్‌పీఎఫ్ అధికారులు, జీఆర్పీ సిబ్బందితో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రాము, ఎస్ఐ శాంతారామ్ తదితరులు పాల్గొన్నారు.

లా కళాశాల విద్యార్థిని ఆత్మహత్య

సీతమ్మధార: అక్కయ్యపాలెంలో నివాసం ఉంటున్న ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నందగిరినగర్‌లో నివాసం ఉంటున్న అలంక గోవిందరావు కుమార్తె దీపిక (18) ఎన్‌బీఎం లా కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతోంది. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో గోవిందరావు కుమారుడు ఇంటికి వచ్చి తలుపులు కొట్టాడు. ఎంతకీ తలుపులు తీయకపోవటంతో, కిటికీ తలుపులు విరగొట్టి చూడగా, ఇంట్లో ఫ్యాన్‌కు దీపిక ఉరేసుకుని కనిపించింది. స్థానికుల సాయంతో దీపికను కిందకు దింపి చూసేసరికి ఆమె అప్పటికే మృతి చెందింది. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా, సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

ఇంతకీ కారు నడిపిందెవరు?

బీచ్‌రోడ్డు: వీఐపీ రోడ్డులో మంగళవారం జరిగిన కారు బీభత్సం కేసులో పోలీసుల వ్యవహారం పలు అనుమానాలకు తావిస్తోంది. మొదట ఆ కారును మద్యం మత్తులో మహిళా వైద్యురాలు నడిపిందని, అనంతరం ఆమె వేరే కారులో వెళ్లిపోయిందనే వార్తలు వచ్చాయి. అయితే కారు నడిపింది మహిళ కాదని, వైద్యుడని బుధవారం పోలీసులు తెలిపారు. కాగా.. ఎఫ్ఐఆర్ నమోదులో నిందితుడైన ముఖర్జీ పేరు లేకుండా కేవలం డ్రైవర్ ఆఫ్ ది కారు రాసి ఉండటంతో పోలీసులు ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ పూర్తి వివరాలతో కేసు నమోదు చేయాలని ఆదేశించినా.. మూడో పట్టణ పోలీసులు సీపీ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారని మండిపడుతున్నారు. దీనిపై మూడో పట్టణ సీఐ రామారావును వివరణ కోరగా.. ఎఫ్ఐఆర్ నమోదు సమయంలో బాధితులు చెప్పిన వివరాలు నమోదు చేస్తామన్నారు. విచారణ పూర్తయిన తర్వాత నిందితుల పేర్లను జతచేస్తామన్నారు. కారు నడిపింది వైద్యురాలు కాదని, సీసీ ఫుటేజ్‌లో ఈ విషయం స్పష్టంగా కనిపించిందన్నారు. తెలిసీతెలియని సమాచారంతో కొందరు ఆరోపణలు చేస్తున్నారన్నారు.

9న క్విట్ మోదీ.. సేవ్ ఇండియా దీక్ష

డాబాగార్డెన్స్: క్విట్ మోదీ..సేవ్ ఇండియా పేరిట చేపట్టనున్న దీక్ష విజయవంతం చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయి. జగదాంబ జంక్షన్ సమీపంలోని సిటు కార్యాలయంలో ఈ నెల 9న చేపట్టనున్న దీక్షలకు సంబంధించి గురువారం అఖిలపక్ష కార్మిక సంఘాలు సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పడాల రమణ మాట్లాడుతూ ఈ నెల 5, 6 తేదీల్లో పరిశ్రమల వద్ద గేట్ సమావేశాలు, పాదయాత్ర, 7న నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర కీలక రంగాలతో సహా ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించే నిర్ణయాలను మోదీ ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. ఈ నెల 9న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టే దీక్షలో కార్మికులు, ఉద్యోగులు, రైతులు, శ్రమజీవులంతా పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. మన్మధరావు, రామకృష్ణ, కనకారావు, ఆర్.లక్ష్మి, శంకరరావు, శశిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగిని అనుమానాస్పద మృతి


మృతురాలు ఇందిరాదేవి

సింధియా: అనుమానాస్పదస్థితిలో ఓ బ్యాంకు ఉద్యోగిని మృతి చెందిన ఘటన మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మల్కాపురం సీఐ దేముడు బాబు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం పరిధి రాంనగర్ కాలనీకి చెందిన ఇందిరాదేవి(26) ఇందిరా నగర్–2 సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వర్తించేది. ఇటీవల యూనియన్ బ్యాంక్‌లో ఉద్యోగం రావడంతో రాజమండ్రి ట్రైనింగ్‌కు వెళ్లి సెలవుపై ఇంటికి వచ్చింది. ఈ తరుణంలో ఇందిరా గురువారం ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మల్కాపురం పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న మల్కాపురం సీఐ జి.దేముడుబాబు.. యువతి ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రూ.435 కోట్ల వ్యాపారం లక్ష్యం

'మహరాజా బ్యాంకు' వ్యవస్థాపక అధ్యక్షుడు రామకృష్ణంరాజు


మాట్లాడుతున్న మహరాజా బ్యాంక్ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకృష్ణంరాజు

సీతమ్మధార: వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ నాటికి రూ.435 కోట్ల వ్యాపారం లక్ష్యంగా పెట్టుకున్నట్టు ది మహరాజా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకృష్ణంరాజు తెలిపారు. బ్యాంకు 23వ మహాజన సభ గురువారం సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో 2023 మార్చి 31 నాటికి రూ.237.33 కోట్లు డిపాజిట్లతో పాటు రూ.166.07 కోట్ల రుణాలు మంజూరు చేశామన్నారు. రూ. 403 కోట్ల వ్యాపారం కలిగి ఉన్నామన్నారు. రూ.4.38 కోట్ల స్థూల ఆదాయం ఆర్జించగా, రూ.1.18 కోట్లు ఆదాయపు పన్ను చెల్లించి, రూ.3.20 కోట్ల నికర ఆదాయం పొందామని ఆయన వివరించారు. బ్యాంకు మూలధనం రూ.12.44 కోట్లు, రిజర్వ్, ప్రొవిజన్‌లు కలిపి రూ.14.75 కోట్లతో నికర విలువ రూ.24.55 కోట్లు ఉందన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సభ్యుల ఆమోదంతో వాటాదారులకు 14 శాతం డివిడెండ్ ప్రకటించినట్టు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుతం జూలై 31 వరకు బ్యాంకు రూ.248 కోట్లు డిపాజిట్లు, రూ.170 కోట్ల రుణాలు ఇచ్చి, రూ.418 కోట్లు వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా పూర్వ సహకార అధికారి, ప్రస్తుత విశాఖ డెయిరీ జనరల్ మేనేజర్ ఏవీవీఎస్ ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో పైడా ఎడ్యుకేషనల్ సంస్థ చైర్మన్ పైడా కృష్ణప్రసాద్, షిప్‌యార్డు కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఫెడరేషన్ చైర్మన్ జి.మదనగోపాల స్వామి, గాయత్రీ కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు(జగిత్యాల) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.శ్రీనివాస్, జనరల్ మేనేజర్ ఎస్.ఎన్.సత్యనారాయణ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో వైద్య సేవలు సంతృప్తికరం

ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు


మాజీ ఎమ్మెల్యే జయరాజును పరామర్శిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వైద్యం కోసం వచ్చే రోగులకు కేజీహెచ్‌లో అందుతున్న వైద్య సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు అన్నారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజును పరామర్శించేందుకు గురువారం ఆయన ఆస్పత్రికి వచ్చారు. రాజేంద్రప్రసాద్ వార్డులో చికిత్స పొందుతున్న జయరాజును పరామర్శించి, అందుతున్న వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో ఉన్న ఎస్టీ సెల్‌ను సందర్శించి రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు అందిస్తున్న వైద్య సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో వైద్య సేవలు ఇదే రీతిలో కొనసాగించాలని సూచించారు. గిరిజన ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ట్రైబల్ సెల్ ద్వారా అంబులెన్స్ సదుపాయం కల్పించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఇతర అధికారులు డాక్టర్ సత్యప్రసాద్, డాక్టర్ సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

ఆరిలోవ : విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీలకు గంజాయి నింపిన బీడీలు, మత్తు మాత్రలు విక్రయిస్తుండగా ఓ యువకుడు జైల్ సిబ్బందికి పట్టుబడ్డాడు. బెయిల్‌పై బయటకు వచ్చిన ఆ యువకుడు మళ్లీ జైలు లోపలకు వెళ్లిపోయాడు. ఈ మేరకు గురువారం ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరిలోవ సీఐ సోమశేఖర్ తెలిపిన వివరాలు ప్రకారం.. నగరంలో జోడుగుళ్లపాలేనికి చెందిన మైలపల్లి ఎల్లాజీ(23) ఓ కేసులో కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉండి ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చాడు. జైల్ లోపల ఉన్నప్పుడు కొంతమంది ఖైదీలతో పరిచయం పెంచుకున్నాడు. వారికి గంజాయి, మత్తు మాత్రలు విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. గంజాయి నింపిన 30 బీడీలు, కొన్ని ఖైనీ ప్యాకెట్లు, 21 నైట్రోసన్ 10 ఎంజీ మాత్రలు, మరో 100 గ్రాముల విడిగా గంజాయి ప్యాకెట్ పట్టుకొని బుధవారం జైలుకు వెళ్లాడు. ములాఖత్ ద్వారా ఖైదీ స్నేహితుడితో మాట్లాడాడు.

అనంతరం జైల్ ప్రధాన ద్వారం పక్కన వాహనాల పార్కింగ్ వద్దకు వెళ్లి తిరుగుతూ అక్కడ గోడ పైనుంచి లోపలకు గంజాయి బీడీలు, మత్తు పదార్థాలతో కూడిన ప్యాకెట్ విసురుతుండగా అక్కడ విధులు నిర్వహిస్తున్న వార్డరుకు ఎల్లాజీ పట్టుబడ్డాడు. ఈ విషయాన్ని జైల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జైల్ సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్ సూచనలతో డిప్యూటీ జైలర్ ఆర్.మహేష్ అదేరోజు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ సూర్యనారాయణ గురువారం కేసు నమోదు చేసి ఎల్లాజీని రిమాండ్‌కు తరలించారు. జైలులో ఎలాంటి మత్తు పదార్థాలు వినియోగించడానికి ఆస్కారం లేదని జైల్ సూపరింటెండెంట్ తెలిపారు. దీనిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులకు కూడా సమాచారం ఇచ్చామన్నారు. కొంత మంది సిబ్బంది సహకారంతోనే జైలులో ఎల్లాజీ మత్తు పదార్థాల విక్రయాలు చేపట్టినట్టు పోలీసులు భావిస్తున్నారు.